సాక్షి
కామారెడ్డి
శనివారం । 6 । జనవరి । 2024



పేదల అభ్యున్నతికి కృషి

ప్రభుత్వం పేదల అభ్యున్నతికి కృషి చేస్తోందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు.

- 8లో ▸



పింఛన్ల పంపిణీలో..

పింఛన్ల పంపిణీకి సిగ్నల్ సమస్యగా మారింది. దీంతో లబ్ధిదారులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
30.9 /15.5

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. శీతల గాలులు వీస్తాయి. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నేడు జిల్లాలో మంత్రి జూపల్లి పర్యటన

కామారెడ్డి క్రైం: జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాలలో పర్యటించనున్నారు. ఆయన ఉదయం 9.30 గంటలకు జుక్కల్ మండలంలోని జగన్నాథపల్లి గ్రామానికి చేరుకొని కౌలాస్ కోటను సందర్శిస్తారు. 10.30 గంటలకు పిట్లం మండలంలోని కుర్తి గ్రామంలో నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం కొత్తపల్లి గ్రామానికి వెళ్లి, ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొంటారు. తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు బాన్సువాడ చేరుకుంటారు. అక్కడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తారు. జుక్కల్ నియోజకవర్గంలో మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పరిశీలించారు.

ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్ 1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సులో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నారు. నిజామాబాద్‌లో ఫిబ్రవరి 1న ప్రారంభమయ్యే కోచింగ్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన అర్హులైన అభ్యర్థులు ఈనెల 8 నుంచి 20వ తేదీ వరకు అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 08462-241055 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

స్కాలర్‌షిప్‌ల కోసం..

కామారెడ్డి అర్బన్: 2023-24 విద్యాసంవత్సరానికి ప్రభుత్వ స్కాలర్‌షిప్ అవసరమైన అన్ని కులాలు, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులు ఈనెల 31లోగా అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ జిల్లా సంక్షేమాధికారి రజిత ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త దరఖాస్తులతో పాటు రెన్యువల్ అవసరమైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

9న మెగా జాబ్ మేళా

కామారెడ్డి అర్బన్: హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో ఈనెల 9న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియట్ జిల్లా అధికారి షేక్‌సలాం తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, ఎంఈసీ విద్యార్థులకోసం ఈ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిర్వహించే జాబ్ మేళాకు ఆసక్తిగల విద్యార్థులు హాజరు కావాలని, ఇతర వివరాలకోసం 94935 53821, 80740 65803 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు. ఈనెల 20న ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో హెచ్‌సీఎల్ జాబ్ మేళాలు ఉంటాయని పేర్కొన్నారు.

8న ఎన్‌వైకే ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు

నిజామాబాద్‌నాగారం : నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో ఉపన్యాస పోటీలు ఈనెల 8న నగరంలో సుభాష్‌నగర్‌లో ఎన్‌వైకే కార్యాలయంలో ఉంటాయని కోఆర్డినేటర్ శైలి బెల్లాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపన్యాస పోటీలో 15ఏళ్ల నుంచి 29ఏళ్ల మధ్య యువత ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఉపన్యాస అంశం 'నా భారతం వికసిత భారతం 2047 నాటికి..' అనే అంశం మీద ఉపన్యసించాలన్నారు. గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయికి పంపుతామన్నారు. జిల్లాస్థాయి పోటీల కోసం ఈనెల 7వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఎన్‌వైకే 9100435410కు వాట్సాప్ ద్వారా తమ పేర్లు ఇవ్వాలన్నారు. రాష్ట్రస్థాయి పోటీలో ప్రథమ బహుమతి రూ. 1 లక్ష, ద్వితీయ బహుమతిగా రూ. 50,000 తృతీయ బహుమతిగా ఇద్దరికీ రూ. 25 వేల చొప్పున అందించనున్నట్లు తెలిపారు.


నేడు ముసాయిదా విడుదల

సుభాష్‌నగర్(నిజామాబాద్ అర్బన్): పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ముసాయిదా ఓటరు జాబితాను ఎన్నికల అధికారులు శనివారం విడుదల చేయనున్నారు. ఈనెల 21వ తేదీవరకూ ఓటరుగా నమోదుకు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు అవకాశముంది. 20, 21వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపులను పోలింగ్ కేంద్రాల వారీగా నిర్వహించనున్నారు. ఆయా తేదీల్లో నమోదుతో పాటు మార్పులు, చేర్పులు, తొలగింపులకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఫిబ్రవరి 5 వరకు దరఖాస్తులు పరిశీలిస్తారు. అనంతరం 8వ తేదీన ఓటరు తుది జాబితాను విడుదల చేయనున్నారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,549 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. 13,94,986 మంది ఓటర్లున్నారు. 7,33,468 మంది స్త్రీలు, 6,61,460 మంది పురుషులు, 58మంది ఇతరులున్నారు.

నసీబ్ ఎట్లుందో?

- ఎమ్మెల్సీ షెడ్యూల్ వెలువడడంతో షబ్బీర్ అలీలో ఆశలు
- మండలి ద్వారా మంత్రి వర్గంలోకి వెళ్లాలని...
- తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న మాజీ మంత్రి





శాసనసభ్యుల కోటాకు సంబంధించిన ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో షబ్బీర్ అలీ అనుచరుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లాలో దశాబ్దాలుగా పార్టీకి కేరాఫ్ అడ్రస్‌గా ఉంటూ వస్తున్న ఆయనకు అవకాశం ఇవ్వాలని వారు కోరుతున్నారు. మండలి ద్వారా మంత్రి వర్గంలోకి వెళ్లడం కోసం షబ్బీర్ అలీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

సాక్షి, కామారెడ్డి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టినా ఎమ్మెల్యేగా ఓడిపోవడంతో మాజీ మంత్రి షబ్బీర్ అలీ అనుచరులు నిరాశ చెందారు. ఎన్నికల్లో గెలిచి ఉంటే కీలకమైన పదవులు వరించేవని వారు భావిస్తున్నారు. అయితే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో మైనారిటీ వర్గానికి చెందిన ఏ ఒక్కరూ విజయం సాధించకపోవడతో మైనారిటీ కోటాలో మంత్రి వర్గంలో స్థానం కోసం షబ్బీర్‌అలీ ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యేల కోటాలో రెండు ఎమ్మెల్సీ పదవులు ఖాళీ కావడం, వెనువెంటనే వాటి భర్తీకి షెడ్యూల్ కూడా వెలువడడంతో ఎమ్మెల్సీ పదవి కోసం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర పోటీ ఏర్పడింది. వారందరినీ అధిగమించి పదవి సాధించడం షబ్బీర్ అలీకి పెద్ద సవాలే. అయితే సవాళ్లను అధిగమించి, మండలి ద్వారా మంత్రి మండలిలో అవకాశం దక్కించుకోవాలని ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సన్నిహితుడిగా ఉన్న షబ్బీర్ అలీ కోసం సీఎం సైతం గట్టి ప్రయత్నాలు చేస్తారని షబ్బీర్ అనుచరులు అంటున్నారు.

పూర్వవైభవం కోసం..

2004 లో ఎమ్మెల్యేగా గెలిచిన షబ్బీర్‌అలీ అప్పటి వైఎస్సార్ మంత్రివర్గంలో కేబినెట్ మినిస్టర్‌గా ఐదేళ్లు కొనసాగారు. 2009 ఎన్నికల్లో ఓడిపోవడంతో ఆయనకు రాజకీయంగా ఇబ్బందులు మొదలయ్యాయి. రెండోసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా, కొంత కాలానికే వైఎస్సార్ అకాల మరణం చెందడంతో షబ్బీర్ మరింతగా ఇబ్బంది పడ్డారు. కాంగ్రెస్ అగ్రనాయకత్వంతో ఉన్న సంబంధాలతో ఎమ్మెల్సీ పదవి సాధించారు. కొంతకాలం మండలిలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. వరుసగా 2014, 2018 ఎన్నికల్లో ఓటమి పాలైనా కామారెడ్డి నియోజక వర్గాన్ని వదలకుండా ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో నిజామాబాద్ అర్బన్‌కు వెళ్లాల్సి వచ్చింది. అక్కడ కూడా ఓడిపోవడంతో ఆయన తీవ్ర నిరాశకు గురయ్యారు. రాష్ట్రంలో ప్రభుత్వం వచ్చినా.. ఓడిపోవడంతో మంత్రి అవకాశం కోల్పోయానని ఆయన ఆవేదన చెందుతున్నారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డితో ఉన్న సన్నిహిత సంబంధాల నేపథ్యంలో ఎమ్మెల్సీ పదవిని సాధించి మంత్రి మండలిలో అడుగుపెట్టడం ద్వారా పూర్వవైభవం పొందాలని భావిస్తున్నారు.

అధికారంలోకి వచ్చినా..

దశాబ్ద కాలం తరువాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, షబ్బీర్ అలీకి సన్నిహితుడైన రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో ఆయన అనుచరుల్లో ఆశలు చిగురించాయి. మూడుసార్లు అసెంబ్లీ ఎన్నికలలో ఓడిపోయినా నియోజకవర్గాన్ని వదలకుండా ఆయన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ వస్తున్నారు. ఈసారి ఎలాగైనా గెలవాలని పక్కా ప్రణాళికతో సాగారు. కానీ కామారెడ్డినుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కేసీఆర్ పోటీ చేయడం.. ఆయనను సవాల్ చేస్తూ రేవంత్‌రెడ్డి బరిలో దిగాలని నిర్ణయించుకోవడంతో షబ్బీర్ అలీ నియోజకవర్గాన్ని మారాల్సి వచ్చింది. కేసీఆర్, రేవంత్ రెడ్డి కామారెడ్డిలో తలపడగా.. మధ్యలో బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి విజయం సాధించారు. అయితే షబ్బీర్‌అలీ అనుకోని పరిస్థితుల్లో నిజామాబాద్ అర్బన్‌లో పోటీ చేసి ఓడిపోయారు. అక్కడ గెలిస్తే రాష్ట్ర ప్రభుత్వంలో మంచి హోదా లభించేదని ఆయన అనుచరులు అంటున్నారు. ఓడినా మైనారిటీ నేతగా షబ్బీర్‌కు తగిన ప్రాధాన్యత లభిస్తుందనే ఆశతో ఉన్నారు.

నేటితో ప్రజాపాలన ముగింపు!

- గ్రామసభలకు పోటెత్తిన దరఖాస్తుదారులు
- గ్యారంటీ పథకాలపై ప్రజల్లో ఆశలు

సాక్షి, కామారెడ్డి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తొలివిడత ప్రజాపాలన కార్యక్రమం శనివారంతో ముగియనుంది. కార్యక్రమం గతనెల 28న మొదలైన విషయం తెలిసిందే. ప్రతి మండలంలో రోజూ రెండు గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 526 పంచాయతీలతో పాటు మూడు మున్సిపాలిటీల పరిధిలోని 80 వార్డులలో ప్రజాపాలన కార్యక్రమం కొనసాగుతోంది. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళల ఖాతాల్లో రూ. 2,500 జమ చేయడం, 200 యూనిట్లలోపు విద్యుత్ వాడుకునే వారికి గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ అందించడం, రైతులకు పంటల సాగుకు రైతుభరోసా కింద ఆర్థిక సాయం అందించడం, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం వంటి కార్యక్రమాలకోసం ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అలాగే రేషన్‌కార్డులకోసం కూడా దరఖాస్తులు స్వీకరించారు. శనివారంతో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగియనుంది. అనంతరం దరఖాస్తులను పరిశీలించి వాటిని ఆన్‌లైన్లో నిక్షిప్తం చేస్తారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్లు మను చౌదరి, చంద్రమోహన్ రోజూ వివిధ మండలాల్లో పర్యటిస్తూ ప్రజాపాలన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. అలాగే ఎల్లారెడ్డి నియోజకవర్గం ప్రజాపాలనలో స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, జుక్కల్ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావులు పాల్గొన్నారు. చివరి రోజున జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో జరిగే ప్రజాపాలన సమావేశాలలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొననున్నారు.

అండర్-20 కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక



కబడ్డీ రాష్ట్ర జట్లకు ఎంపికైన క్రీడాకారులు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని లయోలా ఉన్నత పాఠశాలలో శుక్రవారం అండర్-20 కబడ్డీ జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. ఈనెల 11 నుంచి గజ్వేల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో ఈ జట్లు పాల్గొననున్నాయి. ఎంపిక పోటీల కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరగౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బానాల భాస్కర్‌రెడ్డి, పేటా జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాక వెంకటి, లక్ష్మణ్, అనిల్, లక్ష్మణ్‌రాథోడ్, నరేష్‌రెడ్డి, రాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల జట్టు: కె.నిఖిత, కె.శృతి, ఎస్.రితికారెడ్డి, ఎం.మీనాక్షి, ఎస్.నిఖిత, ఎల్.భూలి, ఎస్.నిఖిత, వి.నందిని, బి.అశ్విని, ఎ.త్రిష, ఎం.నందిని, పి.సురేఖ, పి.హర్షశ్రీ, పి.కల్యాణి.

బాలుర జట్టు: బి.శివస్వామి, హెచ్.వంశి, హెచ్.నితిన్, ఎం.ప్రహ్లాద్, జి.రామ్, ఎస్.రాజు, డి.ఈశ్వర్, ఎం.వినోద్, కె.విజయ్, జె.సాయిబాబా, ఎం.ప్రశాంత్, ఎం.విఠల్, ఎం.నవీన్, ఎం.శ్రీకాంత్.

కానిస్టేబుల్ పోస్టులకు గ్రీన్‌సిగ్నల్

- ఉమ్మడి జిల్లాలో 700ల ఏఆర్, సివిల్ కానిస్టేబుల్ పోస్టులు
- ఎక్సైజ్, ఆర్టీవో, ఫైర్ పోస్టులు అదనం..
- నాలుగు వారాల్లో నియామకాలు పూర్తి చేయాలని కోర్టు ఆదేశం
- అభ్యర్థుల్లో చిగురిస్తున్న ఆశలు



ఖలీల్‌వాడి : కానిస్టేబుల్ పోస్టుల నియామకాలకు కోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉమ్మడి జిల్లాలో ఏఆర్, సివిల్ కానిస్టేబుల్ 700 పోస్టులు ఉన్నాయి. వీటితో ఎక్సైజ్, ఆర్టీవో, ఫైర్ పోస్టులతో పాటు టీఎస్‌ఎస్‌పీ పోస్టులకు ఉమ్మడి జిల్లా అభ్యర్థులు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నాలుగు ప్రశ్నలు మినహాయించి అభ్యర్థులందరికీ నాలుగు మార్కులు ఇవ్వాలని అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. దీంతో సింగిల్ బెంచ్ కోర్టు 4 మార్కులు కలిపి మళ్లీ రిజల్ట్ ఇవ్వాలని తీర్పునిచ్చింది. దీంతో కొంతమంది అభ్యర్థులు ద్విసభ్య ధర్మాసనానికి ఫిర్యాదు చేశారు. కోర్టు గురువారం తీర్పు వెలువరించింది. ఇందులో నాలుగు వారాల్లో నాలుగు మార్కులకు సంబంధించిన నిపుణుల కమిటీ నివేదిక ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. నాలుగు వారాల్లో నియామకాలు పూర్తి చేయాలని కూడా కోర్టు ఆదేశించింది. గతేడాది అక్టోబర్ 4న తుది ఫలితాలను వెలువరించిన తర్వాత ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను సిద్ధం చేశారు. అనంతరం ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించారు. తర్వాత ఎంపికైన అభ్యర్థుల గురించి ఎస్బీ ఎంక్వైరీ పూర్తి చేశారు. మెడికల్ టెస్టులు నిర్వహించిన అనంతరం ట్రైనింగ్‌కు వెళ్లే అవకాశాలున్నాయి. కోర్టు తీర్పుపై అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటన కోసం అభ్యర్థులు వేచి చూస్తున్నారు.

కబడ్డీ పోటీలకు కామారెడ్డి రెడీ

- రేపటి నుంచి ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి టోర్నీ..
- పాల్గొననున్న 29 రాష్ట్రాల జట్లు
- క్రీడాకారులకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు



జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో పోటీలకు ఏర్పాట్లు చేస్తున్న ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు

కామారెడ్డి టౌన్: జాతీయ స్థాయి అండర్-17 కబడ్డీ పోటీలకు కామారెడ్డి జిల్లా కేంద్రం వేదిక కాబోతోంది. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి 11 వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి. ఈ టోర్నీలో 29 రాష్ట్రాలకు చెందిన జట్లు పాల్గొననున్నాయి. పోటీలను విజయవంతం చేసేందుకు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) పక్షం రోజులుగా శ్రమిస్తోంది.

రెండుచోట్ల కంట్రోల్ రూంలు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో కబడ్డీ టోర్నీ నిర్వహించనున్నారు. 29 రాష్ట్రాలకు చెందిన 29 జట్లు శనివారం కామారెడ్డికి చేరుకోనున్నాయి. క్రీడాకారులకు బస్టాండ్‌తోపాటు రైల్వే స్టేషన్ వద్ద స్వాగతం పలికేందుకు ఎస్‌జీఎఫ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాలనుంచి వచ్చే క్రీడాకారుల సౌలభ్యం కోసం బస్టాండ్‌తో పాటు రైల్వే స్టేషన్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్‌రూంలు ఏర్పాటు చేశారు. 29 జట్లకు సంబంధించి మొత్తం 450 మంది క్రీడాకారులు, వారి వెంట వచ్చే కోచ్, మేనేజర్, హెచ్‌వోడీలకు మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ భవనంలో వసతి సౌకర్యం కల్పించారు. ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఫైనల్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించి, డ్రా పద్ధతిలో షెడ్యూల్ ఖరారు చేస్తారు.

ఏర్పాట్లు పూర్తి..

కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నాలుగు అత్యాధునిక మ్యాట్స్‌తో కూడిన నాలుగు కబడ్డీ కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. పోటీల నిర్వహణలో 67 మంది రిఫరీస్, 70 టెక్నీషియన్లు, 100 మందికి పైగా ఆర్గనైజర్లు పాలు పంచుకుంటున్నారన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకున్నా దాతల సాయంతో పోటీలకు ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పోటీలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డితో పాటు జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులను టోర్నీ ప్రారంభం, ముగింపు ఉత్సవాలకు ఆహ్వానించామని తెలిపారు.

ఉత్కంఠగా ఆర్మూర్ బల్దియా రాజకీయం

- ఉత్తర్వులు రానంతవరకు తానే చైర్‌పర్సన్ అంటున్న వినీత
- అవిశ్వాస తీర్మానం అనంతరం ఇన్‌చార్జి చైర్‌పర్సన్ నియామకంలో జాప్యం
- ఎన్నిక తేదీని ఖరారు చేయాల్సిన సీడీఎంఏ



ఆర్మూర్ : ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఆర్మూర్ బల్దియా రాజకీయంలో ఉత్కంఠ చోటు చేసుకుంది. అవిశ్వాస తీర్మానానికి సంబంధించి సమావేశాన్ని నిర్వహించిన స్పెషల్ ఆఫీసర్, ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు నివేదించారు. కలెక్టర్ ఈ నివేదికను కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్-తెలంగాణ (సీడీఎంఏ)కు పంపిస్తారు. సీడీఎంఏ వైస్‌చైర్మన్‌కు ఇన్‌చార్జి చైర్‌పర్సన్ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తారు. అదేవిధంగా నూతన చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించడానికి తేదీని కూడా ఖరారు చేసి ఉత్తర్వులు జారీ చేస్తారు. అప్పటిదాకా వైస్‌చైర్మన్ ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ అధికార మార్పు ప్రక్రియ పూర్తి కావడంలో ఆలస్యం జరుగుతుండటంతో చైర్‌పర్సన్ పదవి నుంచి తొలగిస్తున్నట్లు తమకు అధికారిక ఉత్తర్వులు రాలేదు కాబట్టి అప్పటివరకు తానే చైర్‌పర్సన్‌ను అంటూ పండిత్ వినీత మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు వస్తానని తమ సన్నిహితులతో పేర్కొన్నట్లు సమాచారం.

లెక్కలేసుకుంటున్న ప్రధాన పార్టీలు

అవిశ్వాస తీర్మానం నెగ్గడం అనంతరం నూతన చైర్‌పర్సన్ ఎంపిక ప్రక్రియ ముందుండటంతో ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ తమకు మద్దతు పలికే కౌన్సిలర్ల సంఖ్యపై లెక్కలేసుకుంటున్నారు. ఆర్మూర్ మున్సిపాలిటీలో 36 మంది కౌన్సిలర్లతో పాటు ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డికి ఓటు హక్కుంది. చైర్‌పర్సన్ ఎన్నిక సమావేశానికి కోరం సభ్యులు 25 మంది హాజరైతేనే ఎన్నిక సమావేశం నిర్వహిస్తారు. ఈ సమావేశంలో మ్యాజిక్ ఫిగర్ 19 మంది మెజారిటీ కౌన్సిలర్లు ఎవరికి ఓటు వేస్తే వారు చైర్ పర్సన్‌గా ఎన్నికవుతారు. దీంతో 2020 జనవరిలో తమ పార్టీ నుంచి ఎంతమంది కౌన్సిలర్లు ఎన్నికయ్యారు.. అందులో పార్టీ ఫిరాయించిన వాళ్లెందరు.. స్వతంత్ర అభ్యర్థులు లేదా తమతో కలిసి వచ్చే వారెందరనే విషయమై ప్రధాన పార్టీల నాయకులు లెక్కలేసుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

- సీపీఆర్‌పై యువతకు శిక్షణ ఇవ్వాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రోడ్డు భద్రత అంశంపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలన్నారు. బీటీ రోడ్లపై కేజీవీల్స్‌తో తిరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారి వెంట ఉండే గ్రామాల్లో పోలీస్ కళాబృందాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫస్ట్ రెస్పాండర్‌గా ఉండేందుకు జాతీయ రహదారుల పక్కల ఉండే పెట్రోల్ బంక్‌లు, దాబాల్లో పని చేసే వారికి, యువతకు ప్రథమ చికిత్స, సీపీఆర్‌లపై అవగాహన కల్పించాలని సూచించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాల(బ్లాక్ స్పాట్)ను ఇప్పటికే గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపవద్దన్నారు. అటవీ ప్రాంతంలోని రోడ్లపై నెమ్మదిగా వెళ్లేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాలపై తగిన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాతీయ ప్రాధికార సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీఎస్ రావ్, డీఎస్పీ ప్రకాష్, ఆర్‌అండ్‌బీ డీఈఈ శ్రీనివాస్, డీటీవో వాణి, డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, పంచాయతీ రాజ్ డీఈఈ మురళి, ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

అక్షింతలతో శోభాయాత్ర



వెంకటాపూర్‌లో అక్షింతలకు మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న భక్తులు

ఎల్లారెడ్డిరూరల్: అయోధ్యనుంచి వచ్చిన అక్షింతలతో శుక్రవారం పలు గ్రామాలలో శోభాయాత్రలు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రామపూజిత అక్షింతలను గ్రామాలకు పంపించారు. ఈ సందర్భంగా అక్షింతలకు ఆయా గ్రామాలలో ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. వెంకటాపూర్, జంగమాయిపల్లి గ్రామాలలో ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమాలలో వీహెచ్‌పీ నాయకులు మల్లేష్, వెంకట్రాంరెడ్డి, సురేఖ, రజిత, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయికి ఎంపికైన ఇందల్వాయి విద్యార్థి


బానోత్ విష్ణు

ఇందల్వాయి: జాతీయస్థాయి కబడ్డీ అండర్–17 చాంపియన్‌షిప్‌కు ఇందల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బానోత్ విష్ణు ఎంపికయ్యాడు. దీంతో కామారెడ్డి పట్టణంలో జనవరి 7 నుంచి 11వ తేదీ వరకు జరుగనున్న పోటీల్లో పాల్గొననున్నాడు. ఎంపికైన విద్యార్థిని పాఠశాల హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, సర్పంచ్ పాశం నర్సింలు సత్తెమ్మ, ఎంపీటీసీ మారంపల్లి సుధాకర్ అభినందించారు.

మోపాల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో రగ్బీ పోటీల ఎంపికలు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలకేంద్రంలోని మోపాల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్ – 14 జిల్లాస్థాయి ఎంపికలను శుక్రవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొన్నారు. బాలుర విభాగంలో 15 మంది, బాలికల విభాగంలో 18 మందిని ఎంపిక చేసినట్లు రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెంజర్ల నరేశ్, ఉపాధ్యక్షుడు రాజ్ గణేశ్, కార్యదర్శి అబ్బయ్య తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎండీఎం బిల్లులు ఇప్పించాలని వినతి



సుభాష్‌నగర్: మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ఆరు నెలల నుంచి బిల్లులు రావడం లేదని, వెంటనే బిల్లులు, జీతాలు ఇప్పించాలని తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్నభోజన వంట కార్మికుల సంఘం అధ్యక్షురాలు ఆర్మూర్ సునంద కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అప్పులు చేసి భోజనం పెడుతున్నామని, బిల్లులు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 8 నెలల నుంచి గౌరవ వేతనం ఇవ్వడం లేదన్నారు. అలాగే గుడ్డు ధర విపరీతంగా పెరిగిందని, గుడ్డు బదులు అరటిపండ్లు పెట్టేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. నిర్వాహకులు జయమ్మ, జుబేదా బేగం, నాజియా బేగం, గంగాధర్, ఇంద్ర పాల్గొన్నారు.

దాడి కేసులో 12 మంది రిమాండ్

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హౌసింగ్‌బోర్డు, కోటగల్లిలో డిసెంబర్ 31 రాత్రి పలువురి దాడి చేసిన కేసులో 12 మందిని అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. దాడుల్లో మరికొందరు ఉన్నట్లు పేర్కొన్నారు. విచారణ ఆధారంగా నిందితులను అదుపులోకి తీసుకుంటామని చెప్పారు.

సలహా సమావేశాలకు స్వస్తి!

- కమ్యూనిటీ ఆస్పత్రుల్లో సలహా మండలి సమావేశాలు నిర్వహించని వైనం
- మూడు నెలలకోసారి నిర్వహించాల్సి ఉన్నా పట్టించుకోని ప్రజాప్రతినిధులు



మోర్తాడ్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రి

మోర్తాడ్(బాల్కొండ): ఆస్పత్రుల్లోని సౌకర్యాలను మెరుగుపర్చడం, సమస్యలను గుర్తించి పరిష్కరించడం కోసం నిర్వహించాల్సిన సలహా మండలి సమావేశాలకు ప్రజాప్రతినిధులు స్వస్తి పలికారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఆయా మండలాల ఎంపీపీలు చైర్మన్‌లుగా కొనసాగుతున్నారు. సామాజిక ఆస్పత్రులకు మాత్రం నియోజకవర్గ ఎమ్మెల్యేలు చైర్మన్‌లుగా, ఇతర ప్రజాప్రతినిధులు సభ్యులుగా ఉన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సలహా మండల సమావేశాలను నిర్వహించాలనే నిబంధన ఉంది. మోర్తాడ్, బాల్కొండ, డిచ్‌పల్లి, ధర్పల్లి, నవీపేట్, వర్ని, కోటగిరిలలో 30 పడకల ఆస్పత్రులు, ఆర్మూర్‌లో వంద పడకల ఆస్పత్రి, బోధన్‌లో జిల్లా ఆస్పత్రి ఉంది. భీమ్‌గల్‌లో కమ్యూనిటీ ఆస్పత్రి భవన నిర్మాణం కొనసాగుతుండగా వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలోనే వైద్య సేవలు కొనసాగుతున్నాయి. ఇతర మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. బోధన్ ఆస్పత్రిలో సలహా మండలి సమావేశం నిర్వహిస్తున్నారు. మిగతా ఆస్పత్రుల్లోనే సలహా మండలి సభ్యులు నిద్రావస్థలో ఉండడంతో సమావేశాలపై దృష్టి సారించడం లేదు. వైద్యులు సమావేశాలపై ప్రజాప్రతినిధులకు సమాచారం ఇస్తున్నా నాయకులు పెడచెవిన పెడుతుండడంతో ఇబ్బందికరమైన పరిస్థితి నెలకొంది. సలహా మండళ్లకు నిధుల కేటాయింపు లేకపోవడం కూడా సమావేశాల నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయనే వాదన వినిపిస్తుంది. సలహా మండలి సమావేశాలను నిర్వహిస్తేనే వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరై రోగులకు అందుబాటులో ఉంటారని పలువురు సూచిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వైద్యశాలల్లో సౌకర్యాలను మెరుగుపర్చడం, ఇతర సేవల వృద్ధి కోసం సలహా మండలి సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఆన్‌లైన్ నమోదులో తప్పులకు తావివ్వొద్దు

- ఆర్డీవో రాజేంద్ర కుమార్


కంప్యూటర్ ఆపరేటర్లకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో రాజేంద్ర కుమార్

డిచ్‌పల్లి: ప్రజాపాలన దరఖాస్తులను తప్పుల్లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆర్డీవో రాజేంద్ర కుమార్ సూచించారు. శుక్రవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని మానవతాసదన్‌లో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల కంప్యూటర్(డేటా ఎంట్రీ) ఆపరేటర్లకు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 17వ తేదీలోపు దరఖాస్తులన్నింటినీ సక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రజాపాలన ప్రజలు ఏఏ పథకాలకు దరఖాస్తు చేసుకున్నారో వాటి వివరాలను తప్పులకు ఆస్కారం లేకుండా కంప్యూటర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. దరఖాస్తులను నమోదు చేసే ఆపరేటర్ వివరాలు సైతం తెలిసిపోతాయని.. జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి తహసీల్దార్ రాజేందర్, ఎంపీడీవో టీవీఎస్ గోపిబాబు, డీఎల్‌పీవో నాగరాజు, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

మొదలైన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. సాయంత్రం నుంచి ఆపరేటర్లు గ్రామాల వారీగా తమకు కేటాయించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

యువత దేశభక్తిని అలవర్చుకోవాలి

- రెండో రోజు కొనసాగిన క్రీడోత్సవాలు


పోటీలను ప్రారంభిస్తున్న ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మనోజ్‌కుమార్

తెయూ(డిచ్‌పల్లి): నేతాజీ సుభాష్‌చంద్రబోస్, స్వామి వివేకానంద లాంటి మహనీయుల స్ఫూర్తితో యువత దేశభక్తిని అలవర్చుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రెండోరోజు యువజన క్రీడోత్సవాలు కొనసాగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన మనోజ్‌కుమార్ క్రికెట్, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు, ఓటమి సహజమని, క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు, నాయకులు సాయికుమార్, అమృత్ చారి, ప్రమోద్, సింహాద్రి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీకి మానస



నిజామాబాద్‌నాగారం: జాతీయస్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొనే తెలంగాణ జట్టుకు జిల్లాకు చెందిన మానస ఎంపికైంది. ఈ నెల 6 నుంచి 11వరకు మహారాష్ట్రలోని గడ్చిరోలిలో జరిగే పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించనుంది. మానసను జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు మానస గణేష్, ప్రధాన కార్యదర్శి శ్యామ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, సలహాదారులు ఎన్వీ హనుమంత్ రెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు విద్యాసాగర్ రెడ్డి, మల్లేశ్ గౌడ్ అభినందించారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక


గంగజమున ను అభినందిస్తున్న సర్పంచ్


బిందు, సుహాసశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

డిచ్‌పల్లి: మిట్టాపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని గంగజమున జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుశీల్‌కుమార్ తెలిపారు. ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అండర్–17 పోటీల్లో నిజామాబాద్ జిల్లా జట్టు బంగారు పతకం సాధించడంలో కీలకపాత్ర పోషించిందన్నారు. దీంతో ఆమె జాతీయ పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఈనెల 10 నుంచి 15 వరకు రాజస్థాన్‌లో జరుగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. విద్యార్థిని శుక్రవారం పాఠశాలలో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సంగీతరావు, సర్పంచ్ తేలు గణేశ్, ఎంపీటీసీ బాలగంగాధర్, ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సుద్దపల్లి గురుకుల విద్యార్థినులు

సుద్దపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల విద్యార్థినులు బిందు, సుహాసశ్రీ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గోదావరి తెలిపారు. ఈ నెల 10 నుంచి 15 వరకు రాజస్థాన్‌లో జరుగనున్న 67వ స్కూల్ గేమ్స్ జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీ ల్లో వీరు పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులను శుక్రవారం ప్రిన్సిపాల్ గోదావరి, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి సంగీతరావు, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగమోహన్, వైస్ ప్రిన్సిపాల్ వనిత, పీఈటీలు నల్లూరి లత, మౌనిక అభినందించారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

- కేటీఆర్‌వి పిల్లచేష్టలు
- మాజీ మంత్రి షబ్బీర్‌అలీ


మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

ఖలీల్‌వాడి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని మాజీ మంత్రి, కాంగ్రెస్ నిజామాబాద్ అర్బన్ ఇన్‌చార్జి షబ్బీర్‌అలీ స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు గ్యారెంటీలు అమలు చేశామన్నారు. మరో రెండింటిని కూడా త్వరలో అమలు చేస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ వార్డుల్లో ఐదుగురు సభ్యుల బృందంతో పాటు నోడల్ అధికారులు కలిసి ఈ పథకాలను అమలు చేస్తారని చెప్పారు. అంతా పారదర్శకంగా ఉంటుందని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో కేటీఆర్ ఫ్రస్టేషన్‌లో పిల్లచేష్టలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్ రూంలు, రుణామాఫీ పథకాలు అమలు చేయలేదన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రజాపాలన సెంటర్లను పరిశీలించారు. నగరంలో అభయహస్తం దరఖాస్తులు లక్ష అందించగా, 88వేల వచ్చాయన్నారు. దరఖాస్తుల గడువు పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశవేణు, నాయకులు భక్తవత్సలం, వైశాక్షి సంతోష్, వేణు రాజ్, మైనారిటీ జావీద్, రేవతి పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి చేస్తాం

- హామీలన్నీ నెరవేరుస్తాం
- ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ప్రజా సంక్షేమం కోసమే 'ప్రజా పాలన' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. శుక్రవారం తిర్మన్‌పల్లిలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మండలాలతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ పాలనతో ఇందిరమ్మ రాజ్యం రాబోతుందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ఎక్కడ చూసినా అభివృద్ధి కనిపించడం లేదన్నారు. అభివృద్ధి కోసం కాంగ్రెస్‌కు పట్టంగట్టిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామ ప్రజల నుంచి ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. కలెక్టర్ జితేశ్ వి పాటిల్, వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ హిమబిందు, ఎంపీడీవో లక్ష్మి, సర్పంచ్ బాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భానుమతి శుక్రవారం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావును మర్యాద పూర్వకంగా కలిసి మోడల్ స్కూల్‌లో నెలకొన్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

ప్రజాపాలన ద్వారా ప్రజల వద్దకు ప్రభుత్వం


దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి: ప్రజాపాలన ద్వారా ప్రజల వద్దకు ప్రభుత్వం వచ్చిందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని 12వ వార్డులో ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు శుక్రవారం పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నదన్నారు. అర్హులకు పథకాలను అమలు చేస్తుందన్నారు. నాయకులు అశోక్, సాయిబాబా, ఆరిఫ్, గోపికృష్ణ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు చేయూత

- ప్రాజెక్టు డైరెక్టర్ బాబయ్య


రామారెడ్డిలో దివ్యాంగ విద్యార్థులతో మాట్లాడుతున్న పీడీ బాబయ్య

రామారెడ్డి(ఎల్లారెడ్డి): రామారెడ్డి బాలికల పాఠశాలోని దివ్యాంగుల పాఠశాలను ప్రాజెక్టు డైరెక్టర్ బాబయ్య, జిల్లా సహిత విద్యా సమన్వయ్యకర్త శ్రీపతి శుక్రవారం సందర్శించారు. సెంటర్‌లో దివ్యాంగ విద్యార్థులకు సమగ్ర శిక్ష ద్వారా అందుతున్న వివిధ సేవలను పరిశీలించారు. దివ్యాంగ విద్యార్థులకు అందుతున్న సేవల ద్వారా కలుగుతున్న ప్రయోజనాలు, విద్యార్థులకు ఎలాంటి చేయూత అందిస్తున్నారనే అనే విషయాలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నట్లుగా పీడీ తెలిపారు. సదరం సర్టిఫికెట్లలో జరుగుతున్న చిన్న చిన్న పొరపాట్ల వల్ల దివ్యాంగ విద్యార్థులు కోల్పోతున్న ప్రభుత్వ పథకాలపై వివరించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దివ్యాంగ విద్యార్థులకు బోధన సిబ్బంది రమేశ్, సజన, కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆనంద్, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మురళి, సీఆర్పీలు మహమూద్ సురేఖ ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ అజీముద్దీన్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ జట్లకు శిక్షణ శిబిరం ప్రారంభం


శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సంగీతరావు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): సుద్దపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల క్రీడామైదానంలో శుక్రవారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర సీనియర్ సాఫ్ట్‌బాల్ మహిళల జట్టు, జిల్లా అండర్ –14 సాఫ్ట్‌బాల్ బాలికల జట్టుకు శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సంగీతరావు, పాఠశాల ప్రిన్సిపాల్ గోదావరి ప్రారంభించారు. రాష్ట్ర సీనియర్ సాఫ్ట్‌బాల్ మహిళల జట్టు శిక్షణ శిబిరాన్ని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సంగీతరావు, జిల్లా అండర్–14 సాఫ్ట్‌బాల్ బాలికల జట్టు శిక్షణ శిబిరాన్ని గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ గోదావరి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంగీతరావు మాట్లాడుతూ..

తెలంగాణ రాష్ట్ర జట్టు క్రీడాకారిణులు ఈ నెల 12 నుంచి 14 వరకు జనగాం జిల్లాలో జరుగనున్న సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపా రు. అలాగే స్కూల్ గేమ్స్ జిల్లా సాఫ్ట్‌బాల్ అండర్ – 14 జట్టు ఈనెల 16 నుంచి 18 వరకు ఆర్మూర్‌లో జరగనున్న రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్ర ధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, వైస్ ప్రిన్సిపల్ దీప్తివాణి, వ్యాయామ ఉపాధ్యాయులు నల్లూరి లత, మౌనిక, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్‌లు నరేశ్, మౌనిక, గంగాధర్ పాల్గొన్నారు.

మట్కా స్థావరంపై దాడి

- నిర్వాహకుడి అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పరిధిలోని కోజా కాలనీలో గల ఓ ఇంట్లో మట్కా నిర్వహిస్తున్న సయ్యద్ సాజిద్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్ ఫోర్స్ బృందం దాడి చేసి అరెస్ట్ చేసిందని, అతని వద్ద నుంచి రూ. 760, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

క్రైం కార్నర్

వ్యక్తి దారుణ హత్య


సయాజీ (ఫైల్)


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నిజామాబాద్‌రూరల్: గొంతుకోసి ఓ వ్యక్తిని హతమార్చిన ఘటన నిజామాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కాపూర్ తండా శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఇంద్రాపూర్‌కు చెందిన గరుధాకర్ సయాజీ(30) మృతదేహాన్ని శుక్రవారం మల్కాపూర్ తండా శివారులోని అడవిలో కనిపించింది. ఘటనాస్థలాన్ని అడిషనల్ డీసీపీ పరిశీలించి గొంతు కోసి హత్య చేసినట్లు గుర్తించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లతో చుట్టుపక్కల ప్రాంతాల్లో తనిఖీలు చేయించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కాలువలో పడి ఒకరి మృతి


కాలువలో పడిన మోటార్ సైకిల్


మల్లేశ్ మృతదేహం

మోర్తాడ్: బైక్‌పై వెళ్తూ నీటికాలువలో పడి యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలోని పాలెం శివారులో చోటు చేసుకుంది. మోర్తాడ్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన పిట్ల మల్లేశ్(35) పాలెం నుంచి మోర్తాడ్ వైపు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా పాలెం శివారులో సబ్‌స్టేషన్ మలుపు వద్ద అదుపుతప్పి నీటి కాలువలో పడి ఊపిరాడక మృతిచెందాడు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. ఆయన వ్యవసాయ పనుల నిమిత్తం గతంలో కామారెడ్డి జిల్లా నుంచి తిమ్మాపూర్‌కు వలస వచ్చాడు.

కేజ్‌వీల్ ట్రాక్టర్ బోల్తా

- ఒకరి మృతి


అనిల్(ఫైల్)


బోల్తాపడిన ట్రాక్టర్

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలం గున్కుల్ శివారులో శుక్రవారం కేజ్‌వీల్ ట్రాక్టర్ బోల్తాపడి అనిల్(23) అనే యువకుడు మృతిచెందాడు. యాసంగి సాగుకు పొలాన్ని ట్రాక్టర్‌తో దమ్ము చేసి వస్తున్నాడు. అదే సమయంలో మరో ట్రాక్టర్ పొలం గట్టు ఎక్కించే ప్రయత్నంలో బురదలో కురుకుపోయింది. దాంతో అనిల్ తన ట్రాక్టర్‌ను పక్కనపెట్టి బురదలో కురుకున్న ట్రాక్టర్‌ను పొలం గట్టెక్కించేందుకు వెళ్లాడు. ట్రాక్టర్‌పైకి ఆన్‌చేసి గట్టు ఎక్కించే ప్రయత్నంలో అది తలకిందులుగా బోల్తాపడింది. దాంతో అనిల్ ట్రాక్టర్ కిందపడి బురదలో కురుకుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై రాజశేఖర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీరన్నగుట్ట తండాలో వ్యక్తి ఆత్మహత్య

రెంజల్(బోధన్): మండలంలోని వీరన్నగుట్ట తండాకు చెందిన రత్నావార్ కృష్ణ(39) అనే వ్యక్తి గురువారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో ఉండి కూలీ పనులు చేసుకుంటున్న కృష్ణ గురువారం ఇంటికి వచ్చాడు. అదే రోజే భార్య నందతో గొడవ కావడంతో ఆమె నవీపేట్ మండలం ఫకీరాబాద్‌లోని పుట్టింటికి వెళ్లింది. అదేరోజు రాత్రి కృష్ణ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు భార్యకు సమాచారం ఇవ్వడంతో ఆమె అత్తారింటికి చేరుకుంది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.